తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
ఆదివారం
10 మే 2026
పేజీలు : 08
Follow :



## రావిచేడ్‌లో లక్ష్మీ నరసింహ
# గార్డెన్ ప్రారంభం

- ముఖ్య అతిథులుగా హాజరైన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

కడ్తాల్ మే09 (జనంసాక్షి):
కడ్తాల్ మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో సర్పంచ్ బొప్పిడి హైమావతి గోపాల్ సుమారు 4 కోట్లతో అధునూతన సదుపాయాలతో నిర్మించిన లక్ష్మీ నరసింహ గార్డెన్(ఫంక్షన్ హాల్)ను కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, యజమాని గోపాల్ మాతృమూర్తి లక్ష్మమ్మ,కుమారులు వంశీకృష్ణ, వరుణ్ కృష్ణ,కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. శనివారం నూతన ఫంక్షన్ హాల్ లో వాస్తు గణపతి, నవగ్రహ, పూజలు, సత్యనారాయణ స్వామి వ్రతం,హోమాన్ని,వేద బ్రాహ్మణోత్తములచే కమనీయంగా నిర్వహించి నూతన ప్రారంభోత్సవం చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌లతో పాటు అతిథులను సర్పంచ్ హైమావతి గోపాల్ స్వాగతం పలికి శాలువాల తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్,షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్,ఫుడ్ కార్పొరేషన్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి,జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గీత నరసింహ్మ,ముఖ్య అతిథులు గా పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.. కడ్తాల్ మండలంలోని రావిచేడ్ గ్రామంలో నూతన హంగులతో లక్ష్మీ నరసింహ గార్డెన్ ను ఏర్పాటు కావడంతో పరిసర ప్రాంత ప్రజలకు శుభ సూచకం అన్నారు. వివాహ శుభకార్యాలతో పాటు అన్ని రకాల కార్యక్రమాలకు సౌకర్యంతో ఉద్యోగులకు వ్యాపారులకు అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉంటుందని ప్రజలందరూ ఈ ఫంక్షన్ హాల్,ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్,ను నిర్మించిన యజమాని సర్పంచ్ బొప్పిడి హైమావతి గోపాల్,కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్,పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్,మాజీ జెడ్పిటిసి విజితా రెడ్డి,సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ బందరి యాదయ్య, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు తదితరులున్నారు.

## 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు
# పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలి

**తపస్ రంగారెడ్డి అధ్యక్ష కార్యదర్శులు కోట్ల కాశిరావు, పూజారి రమేశ.**





**ఇబ్రహీంపట్నం, మే 9(జనం సాక్షి ) :** 2003 డియస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వర్తింపచేయాలని తపస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కోట్ల కాశీ రావు పూజారి రమేష్ లు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలులోకి వచ్చినప్పుడు, దానికి అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన 57/4, 57/5 ఉత్తర్వులు అత్యంత కీలకమైనవి. వీటి ప్రకారం సిపిఎస్ అమలుకు ముందు వెలువడిన నోటిఫికేషన్ల ద్వారా నియామకమైన వారికి పాత పెన్షన్ వర్తింపజేయాలన్నారు. మన రాష్ట్రంలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు ఈ ప్రయోజనాన్ని కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సామాన్య ఉద్యోగ ఉపాధ్యాయులకు మాత్రం నిరాకరించడం సరైనది కాదని అన్నారు. ఉద్యోగులకు అనుకూలంగా హైకోర్టు తీర్పునివ్వడం జరిగింది. మూడు నెలల్లో దీనిని అమలు చేయాలని ఆదేశించింది. అయితే, ప్రభుత్వం దీనిపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడం విచారకరమన్నారు. ఉపాధ్యాయుల న్యాయమైన, పోరాటంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం అన్ని విధాలా అండగా ఉండి ఓపిఎస్ సాధన కు కృషి చేస్తుందని అన్నారు. 2003 డీఎస్సీ పాత పెన్షన్ సాధన కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయులకు సంఘం అండగా ఉంటుందని ప్రభుత్వం వెంటనే రిట్ ఉపసంహరించుకుని ఓపియస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం సమావేశం



**మొయినాబాద్, మే 09, జనంసాక్షి:** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజిత్ నగర్ రెవెన్యూ పరిధిలోని వ్యవసాయ క్షేత్రంలో తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మొయినాబాద్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గోటూరి అనితారెడ్డి, ఉపాధ్యక్షులు టి.జితేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆలూరి రవీందర్, కార్యదర్శిలు గడ్డం సుధాకర్, ఆలూరి శ్రీనివాస్, కోశాధికారి వేణు రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా సోమ నరేష్ యాదవ్, కుమ్మరి రాజు, సలహాదారులు గౌండ్ల నిరంజన్ గౌడ్ లను ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారికి తెలంగాణ రాష్ట్ర ఫోరం వ్యవస్థాపక అధ్యక్షులు అల్లం శ్రీనివాస్ రెడ్డి నియామక పత్రాలను అందజేసి వారిని శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అవిష్వేట ఆంజనేయులు గౌడ్, అన్ని గ్రామాల ఉపసర్పంచులు, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.




## మండల టాపర్ భవ్య రెడ్డికి ఎమ్మెల్యే ప్రోత్సాహకం

**చేవెళ్ల, మే 10 (జనంసాక్షి):** గ్రామీణ ప్రాంత విద్యార్థులు పట్టుదలతో చదివితే రాష్ట్ర, దేశ స్థాయిలో రాణించే అవకాశాలు అపారంగా ఉన్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో 579 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచిన చేవెళ్ళ లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థిని కేశపల్లి భవ్యను శనివారం అభినందించి రూ.10 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. భవ్య రెడ్డి సాధించిన ప్రతిభ చేవెళ్ల మండలానికి గర్వకారణమని పేర్కొంటూ, లక్ష్యాన్ని నిర్దేశించుకుని మరింత కష్టపడి చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, గ్రామీణ విద్యార్థుల్లో అపార ప్రతిభ దాగి ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతావెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్, చేవెళ్ల సహకార సంఘం చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు బండారు శైలజా ఆగిరెడ్డి, శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రధాని మోడీ సభ విజయోత్సవానికి బైక్ ర్యాలీ

- ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు భారీగా తరలి రావాలి : భరత్ గౌడ్

**సికింద్రాబాద్ (జనంసాక్షి) :**
సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో ఈనెల నేడు నిర్వహిస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావారలని బిజెపి మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు భరత్ గౌడ్ ఆధ్వర్యంలో సామాజిక కార్యకర్త, బీజేపీ నాయకులు శ్రీరామ్ వెంకటేష్ తార్నాక నుంచి ఆర్టీసీ ఎక్స్ రోడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. సుమారు మంద మంది కార్యకర్తలతో తార్నాక నుంచి ఓయూ, విద్యానగర్ మీదుగా ఎక్స్ రోడ్డు కు చేరుకుని ఎక్స్ రోడ్డులో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి,బండి సంజయ్ పాల్గొంటున్న బైక్ ర్యాలీలో కలిసి ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు ఆయన తార్నాకలో మీడియాతో మాట్లాడుతూ.. అభివృద్ధి అంటే మోడీ - మోడీ అంటే అభివృద్ధి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని,రాష్ట్ర అభివృద్ధి ప్రధాని అనేక కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రాన్ని ప్రగతి పదంలో నిలిపారన్నారు. నేడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరగబోయే మహాసభలో ప్రధాని మోదీకి సుమారు రూ.



7,823 కోట్ల భారీ ప్రాజెక్టుల ను ప్రారంభించి తెలంగాణ భవిష్యత్తును మార్చబోతున్నారని అన్నారు. రైల్వే స్టేషన్లు ఆధునీకరణ, కొత్త హైవే లు, మల్కాపూర్ వేల సంఖ్యలో రాబోయే ఉద్యోగాలే మన లక్ష్యంగా ముందుకు సాగుతన్నారని, ఈ అభివృద్ధి యజ్ఞంలో మన మంతా భాగస్వామ్యం అవుదాం అవుతూ ప్రధాని మోడీకి ఘన స్వాగతం పలుకుదామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పనులపై అధికారుల ప్రత్యేక దృష్టి

- ప్రజలకు ఇబ్బందులు తగ్గించేందుకు సమగ్ర చర్యలు
- ట్రాఫిక్ నిర్వహణ, డైవర్షన్లపై కీలక సమావేశం



**ఉప్పల్, మే 9 (జనం సాక్షి):** నగరంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించే లక్ష్యంతో చేపట్టిన ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉండే ఉప్పల్ జంక్షన్ మరియు పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు సాఫీగా సాగేందుకు పలు విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న వాహన రద్దీ, నిర్మాణ పనుల కారణంగా కొన్ని ప్రాంతాల్లో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. కారిడార్ పనులు కీలక దశకు చేరుకోవడంతో ట్రాఫిక్ నిర్వహణ, రహదారి డైవర్షన్లు, ప్రజా భద్రత, ప్రత్యామ్నాయ మార్గాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వినయ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసు శాఖ, హెచ్‌ఎండిఏ మరియు సంబంధిత విభాగాల అధికారులు పాల్గొని నిర్మాణ పనుల పురోగతి, ట్రాఫిక్ సమస్యలు, రహదారి మూసివేతలు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా పనులు జరుగుతున్న ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అసౌకర్యం తగ్గించేందుకు పీక్ అవర్స్ సమయంలో ప్రత్యేక ట్రాఫిక్ డైవర్షన్లు అమలు చేయాలని, రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో అదనపు ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. అవసరమైన చోట్ల తాత్కాలిక రహదారులు ఏర్పాటు చేయడం, ట్రాఫిక్ సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం, వాహనదారులకు ముందస్తు సమాచారం అందించడం వంటి చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రాత్రివేళల్లో ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు, ప్రతిబింబించే సిగ్నల్స్, తగిన లైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిర్మాణ ప్రాంతాల చుట్టూ బ్యారికేడ్లు బలోపేతం చేసి ప్రజలు మరియు వాహనదారులు సురక్షితంగా ప్రయాణించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ప్రజా సౌకర్యాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ లేకుండా నిర్ణీత గడువులోపు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు కొంతకాలం సహనంతో సహకరించాలని, ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఉప్పల్ మరియు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని పేర్కొన్నారు. అలాగే వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో నిర్మాణ ప్రాంతాల్లో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ వ్యవస్థను సక్రమంగా నిర్వహించడం, నిర్మాణ సామగ్రి రోడ్లపై పేరుకుపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడం, దుమ్ము కాలుష్యం తగ్గించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉప్పల్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయిన తర్వాత నగర తూర్పు ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉప్పల్, ఎల్బీనగర్, హబ్సిగూడ, నాచారం, పోచారం వైపు వెళ్లే వాహనదారులకు భారీ ఊరట లభించనుందని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న ఈ కీలక ప్రాజెక్టును వేగంగా పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని అధికారులు వెల్లడించారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం యువకుడిని దొంగతనాల బాట పట్టించింది

- ఉప్పల్‌లో ఇంట్లోనే చోరీ చేసిన యువకుడు
- బంగారం, నగదుతో పరార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు



**ఉప్పల్, మే 9 (జనం సాక్షి):** ఆన్‌లైన్ బెట్టింగ్ మరియు గ్యాంబ్లింగ్ వ్యసనం యువత జీవితాలను ఎలా నాశనం చేస్తుందో తెలిపే ఘటన ఉప్పల్‌లో వెలుగుచూసింది. బెట్టింగ్‌కు బానిసైన ఓ యువకుడు చివరకు సొంత ఇంట్లోనే దొంగతనానికి పాల్పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. కుటుంబ సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ ఇంట్లో ఉన్న బంగారం, నగదు అపహరించి పరారైన ఈ ఘటనపై ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఉప్పల్ ప్రాంతానికి చెందిన సంతోష్ అనే యువకుడు చిన్న వయస్సులోనే ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. కేవలం ఇరవై ఏళ్ల వయస్సులోనే మొబైల్ ఫోన్ ద్వారా వివిధ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు, గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో డబ్బులు పెట్టడం ప్రారంభించాడు. మొదట చిన్న మొత్తాలతో మొదలైన బెట్టింగ్ అలవాటు క్రమంగా తీవ్ర వ్యసనంగా మారిందని సమాచారం. బెట్టింగ్‌లో వరుసగా డబ్బులు కోల్పోతూ వచ్చిన సంతోష్, అప్పులు కూడా చేయడం ప్రారంభించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డబ్బుల కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న సమయంలో తన తండ్రికి చెందిన బైక్‌ను కూడా తాకట్టు పెట్టి రూ.10 వేల వరకు తీసుకుని బెట్టింగ్‌లో పెట్టినట్లు తెలిసింది. అయితే ఆ డబ్బులు కూడా పూర్తిగా నష్టపోవడంతో మరింత ఆర్థిక ఒత్తిడికి గురైనట్లు సమాచారం. ఈ నెల 4వ తేదీన కుటుంబ సభ్యులు ఓ ఫంక్షన్‌కు వెళ్లిన సమయంలో ఇంట్లో ఎవరూ లేని అవకాశాన్ని వినియోగించుకున్న సంతోష్, ఇంట్లో ఉన్న ఒక తులం బంగారు గొలుసు, చెవి రింగులు మరియు రూ.10 వేల నగదును అపహరించి అక్కడి నుంచి పరారయ్యాడు. ఇంటికి తిరిగి వచ్చిన కుటుంబ సభ్యులు బీరువాలో ఉన్న బంగారం, నగదు కనిపించకపోవడంతో షాక్‌కు గురయ్యారు. అనంతరం అనుమానం రావడంతో సంతోష్ కోసం వెతికినా అతడు కనిపించకపోవడంతో తండ్రి ఉప్పల్ పోలీసులను ఆశ్రయించారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువకుడు ఎక్కడికి వెళ్లాడు, దొంగిలించిన బంగారం మరియు నగదును ఏమి చేశాడు, బెట్టింగ్ ముఠాలతో ఏమైనా సంబంధాలు ఉన్నాయా అనే కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. అవసరమైతే ఆన్‌లైన్ లావాదేవీల వివరాలను కూడా సేకరించే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనతో స్థానికంగా ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంపై మరోసారి చర్చ మొదలైంది. స్మార్ట్‌ఫోన్‌లు, సోషల్ మీడియా ద్వారా యువతను లక్ష్యంగా చేసుకుని పనిచేస్తున్న బెట్టింగ్ యాప్‌లు అనేక కుటుంబాలను ఆర్థికంగా, మానసికంగా దెబ్బతీస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న వయస్సులోనే సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువత బెట్టింగ్ వైపు ఆకర్షితులవుతున్నారని, చివరకు అప్పులు, నేరాలు, కుటుంబ కలహాలకు దారితీస్తోందని వారు పేర్కొన్నారు. పిల్లల మొబైల్ వినియోగంపై తల్లిదండ్రులు పర్యవేక్షణ పెంచాలని, అనుమానాస్పద ఆన్‌లైన్ గేమింగ్ మరియు బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. యువత భవిష్యత్తును నాశనం చేసే ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# హమాలీ రేట్లు పెంచాలి: సీఐటీయూ




**అబ్దుల్లాపూర్ మెట్, మే 9(జనం సాక్షి ):** అబ్దుల్లాపూర్ మెట్టు మండలం బాటాసింగారం ఫ్రూట్ మార్కెట్‌లో హమాలీ కార్మికులతో కలిసి సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీ రేట్లు పెంచాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ, గత కొంతకాలంగా హమాలీ కార్మికుల కూలి రేట్లు పెరగకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లు వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. 14 రోజుల లోపు హమాలీ రేట్లు పెంచకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవసరమైతే సమ్మెలకు కూడా వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలరాజు, గుండె శివకుమార్, మసూద్, షరీఫ్, కృష్ణ, షబ్బీ, రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ జోన్‌లో అక్రమ మోటార్లపై
# వాటర్ బోర్డు కఠిన చర్యలు

**రామంతాపూర్, గోకుల్ నగర్, నాగేశ్ నగర్ ప్రాంతాల్లో ఐదు ఎలక్ట్రిక్ మోటార్లు స్వాధీనం**




ఉప్పల్ మే 09 ( జనం సాక్షి ): హైదరాబాద్ నగరంలో తాగునీటి సరఫరా వ్యవస్థను దెబ్బతీస్తూ, ఇతర వినియోగదారులకు నీటి ఒత్తిడి తగ్గించే విధంగా అక్రమంగా మోటార్లు వినియోగిస్తున్న వారిపై హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (హెచ్ ఏం డబ్ల్యు ఎస్ ఎస్ బి) కఠిన చర్యలు ప్రారంభించింది. ఉప్పల్ జోన్ పరిధిలోని రామంతాపూర్, గోకుల్ నగర్, నాగేశ్ నగర్ ప్రాంతాల్లో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, ప్రజా నీటి పైపులకు నేరుగా అమర్చిన ఐదు ఎలక్ట్రిక్ మోటార్లను స్వాధీనం చేసుకున్నారు. వాటర్ బోర్డు విజిలెన్స్ మరియు ఆపరేషన్స్ విభాగాల సంయుక్త బృందాలు స్థానికంగా ఫిర్యాదులు రావడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కొంతమంది వినియోగదారులు నీటి సరఫరా లైన్లకు అక్రమంగా మోటార్లు అమర్చడంతో, పరిసర ప్రాంతాల్లోని ఇళ్లకు సరైన ఒత్తిడితో నీరు అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వెల్లడించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ప్రభుత్వ తాగునీటి పైపులకు మోటార్లు అమర్చడం చట్ట విరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటి మోటార్లు కనిపించిన వెంటనే స్వాధీనం చేసుకుంటామని, సంబంధిత వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే తప్పును మళ్లీ పునరావృతం చేస్తే రూ.5,000 జరిమానాతో పాటు కేసు కూడా నమోదు చేస్తామని తెలిపారు. అక్రమ మోటార్ల వాడకం వల్ల నీటి ఒత్తిడి తీవ్రంగా తగ్గిపోవడంతో పాటు పైపులైన్ వ్యవస్థ దెబ్బతింటోందని వాటర్ బోర్డు అధికారులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఎత్తైన ప్రాంతాల్లో నివసించే ప్రజలకు నీటి సరఫరా పూర్తిగా అంతరాయం కలుగుతున్నదని తెలిపారు. కొందరి అక్రమ చర్యల వల్ల మొత్తం కాలనీ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి ఒత్తిడి తక్కువగా వస్తే అక్రమ మోటార్లు ఉపయోగించకుండా, స్థానిక మేనేజర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ (డిజిఎం), జనరల్ మేనేజర్ (జిఎం)లను సంప్రదించాలని సూచించారు. అలాగే వాటర్ బోర్డు హెల్ప్‌లైన్ నంబర్ 155313కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ప్రజలు చట్టాలను పాటిస్తూ తాగునీటిని సమానంగా వినియోగించుకోవాలని, అక్రమ మోటార్ల వాడకాన్ని పూర్తిగా నిలిపివేయాలని వాటర్ బోర్డు విజ్ఞప్తి చేసింది. నగరంలో నీటి సరఫరా వ్యవస్థను పరిరక్షించేందుకు భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

# పర్యాటక అభివృద్ధి అవసరమే

## సీసీఎంబి హబ్సిగూడ శాస్త్రవేత్తలు స్పష్టం

**ఉప్పల్ మే 09 ( జనం సాక్షి ):** హైదరాబాద్ హబ్సిగూడలోని సీసీఎంబి శాస్త్రవేత్తలు పులుల సంరక్షణపై ఆందోళనకర విషయాలు వెల్లడించారు. దేశంలోని పలు టైగర్ రిజర్వ్‌లలో పెరుగుతున్న పర్యాటక కార్యకలాపాలు పులుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని వారు హెచ్చరించారు. 2020 నుంచి 2023 వరకు ఐదు టైగర్ రిజర్వ్‌లలో నిర్వహించిన పరిశోధనలో ఈ అంశాలు బయటపడ్డాయని తెలిపారు. పులుల్లో ఒత్తిడి స్థాయిని అంచనా వేసే ప్రత్యేక హార్మోన్ల ఆధారంగా శాస్త్రవేత్తలు ఈ అధ్యయనం చేపట్టారు. అడవుల్లో సఫారీ వాహనాల సంఖ్య భారీగా పెరగడం, పర్యాటకుల రాకపోకలు అధికమవడం వల్ల పులుల్లో మానసిక ఒత్తిడి పెరుగుతోందని గుర్తించారు. ముఖ్యంగా ఆడ పులుల ప్రజనన వ్యవస్థపై ఈ ప్రభావం తీవ్రంగా పడుతోందని వెల్లడించారు. అధిక ఒత్తిడి కారణంగా పులుల సహజ జీవన విధానం దెబ్బతింటోందని, వేట, విశ్రాంతి, సంచారం వంటి సహజ అలవాట్లలో మార్పులు కనిపిస్తున్నాయని వివరించారు. అడవుల్లో నిరంతరం వాహనాల శబ్దాలు, జన సంచారం ఉండటం వల్ల పులులు ప్రశాంతంగా సంచరించలేకపోతున్నాయని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. కొన్ని ప్రాంతాల్లో పులులు నీటి వనరుల వద్దకు రావడానికీ భయపడుతున్న పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. దీనివల్ల పులుల ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం పడే అవకాశం ఉందని హెచ్చరించారు. పులుల సంరక్షణ కోసం సఫారీ వాహనాల సంఖ్యపై నియంత్రణ విధించాలని సీసీఎంబి శాస్త్రవేత్తలు సూచించారు. పర్యాటకానికి సమయ పరిమితులు పెట్టడంతో పాటు, అడవుల్లో ప్రశాంత వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే వేసవి కాలంలో అడవుల్లో అదనపు నీటి వనరులు ఏర్పాటు చేస్తే పులులు మరియు ఇతర వన్యప్రాణులకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. పులులు అడవి జీవ వ్యవస్థలో






కీలక భాగమని, వాటి ఆరోగ్యం దెబ్బతింటే మొత్తం పర్యావరణ సమతౌల్యం ప్రభావితమవుతుందని శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. పర్యాటక అభివృద్ధి అవసరమే అయినా, వన్యప్రాణుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సీసీఎంబి హబ్సిగూడ శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.

# నిమ్స్‌లో అధునాతన ఎండోస్కోపిక్ స్పైన్ శస్త్ర చికిత్స



**ఖైరతాబాద్, మే 09 (జనం సాక్షి) :** నిజాం ఇన్‌స్టి ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్)లో కరీంనగర్ జిల్లా లింగాన్నపేట గ్రామానికి చెందిన పిట్ల నవీన్ (28)కి అధునాతన మినిమల్లీ ఇన్వేసివ్ ఎండోస్కో పిక్ స్పైన్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వ హించారు. తీవ్ర కాలి నొప్పి, క్రమంగా కాళ్ల బలహీ నతతో బాధపడుతున్న రోగికి ఈ చికిత్స ద్వారా గణనీయమైన ఉపశమనం లభించింది.వైద్య పరీ క్షల అనంతరం రోగి వెన్నెముకలో కీలక ప్రాంతంలో ట్యూమర్ ఉన్నట్లు వైద్యులు గుర్తించారు.అనంత రం ఆరోగ్యశ్రీ పథకం, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) సహకారంతో బయ్‌పోర్టల్ ఎండో స్కోపిక్ టెక్నిక్ ద్వారా శస్త్రచికిత్స నిర్వహించారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో సుమారు రూ.5 లక్షల వరకు ఖర్చయ్యే ఈ చికిత్సను నిమ్స్‌లో పూర్తిగా ఉచితంగా అందించారు.ఈ శస్త్రచికిత్సలో బీహె చ్ఈఎల్-జీఈ సంస్థ, రోటరీ క్లబ్ సహకారంతో నిమ్స్‌కు అందించిన అత్యాధునిక బయ్‌పోర్టల్ ఎండోస్కోపిక్ స్పైనల్ సిస్టమ్‌ను వినియోగించారు. శస్త్రచికిత్స విజయవంతమై రోగికి వెంటనే ఉపశమ నం లభించింది. కాలి నొప్పి గణనీయంగా తగ్గడం తో పాటు కాళ్ల బలం కూడా మెరుగుపడింది. ప్రస్తు తం రోగి డిశ్చార్జ్‌కు సిద్ధంగా ఉన్నారు.ఈ సందర్భం గా నిమ్స్ డైరెక్టర్ ప్రొ.నగరి బీరప్ప మాట్లాడుతూ ఈ ఆధునిక ఎండోస్కోపిక్ సిస్టమ్ ద్వారా ఆర్థి కంగా వెనుకబడిన రోగులకు అత్యాధునిక వెన్నె ముక చికిత్సలను ఉచితంగా అందిస్తున్నామని సాధారణ డిస్క్ ప్రోలాప్స్ శస్త్రచికిత్సల నుంచి క్లిష్టమైన సర్వైకల్, డార్సల్ స్పైన్ ఆపరేషన్ల వరకు అనేక చికిత్సలు ఇప్పుడు నిమ్స్‌లో మినిమల్లీ ఇన్వేసివ్ ఎండోస్కోపిక్ విధానంలో నిర్వహిస్తున్నా మని పేర్కొన్నారు. ఈ శస్త్రచికిత్సను విజయవం తంగా పూర్తి చేసిన డా.ఎర్రగుంట తిరుమల్, డా. మురళీకృష్ణ , డా.ఉమా మహేశ్వర్‌ల బృందాన్ని మరియు న్యూరోసర్జరీ విభాగాధిపతి డా.వంశీకృష్ణ ఎర్రమ్నేని, సీనియర్ ప్రొ.డా.సుచంద లను బీరప్ప అభినందించారు. రోగుల సేవల అభివృద్ధికి నిరం తరం ప్రోత్సాహం, సహకారం అందిస్తున్న తెలం గాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, వైద్య ఆ రోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహకి ని మ్స్ డైరెక్టర్ ప్రొ.నగరి బీరప్ప కృతజ్ఞతలు తెలి పారు.

## అధికార పార్టీ నాయకుల సహకారంతో
## మండల స్థాయి అధికారుల ప్రోత్సాహంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి పరుస్తా

### చిన్న గోల్కొంద గ్రామ సర్పంచ్ దోశెట్టి విశాల సంగమేశ్వర్



**మోమిన్ పేట మే 09 ( జనం సాక్షి)** కాంగ్రెస్ పార్టీ నాయకుల సహకారంతో మండల స్థాయి అధికారుల ప్రోత్సాహంతో చిన్న గోల్కొంద గ్రామాన్ని మండలంలోని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే విధంగా కృషి చేస్తానని చిన్న కోలు కొంద గ్రామ సర్పంచ్ బశెట్టి విశాల సంగమేశ్వర్ పేర్కొన్నారు తెలంగాణ శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మన్నె శంకర్ యాదవ్ సీనియర్ నాయకులు ఎన్ నరోత్తం రెడ్డి ల సహకారంతో గ్రామానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి ప్రతి వాడవాడలో సిసి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వీధిలైట్లు డ్వాక్రా భవనము వర్క్ షెడ్లు గ్రామపంచాయతీ నూతన భవనము పాఠశాల అజరపు గదులు మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు శ్రీకారం చుట్టామని వారు తెలిపారు ప్రస్తుతం ఎన్ఆర్ఈజీఎస్ 20 లక్షల నిధులతో గ్రామంలోశ్రీరోడ్డు పూర్తి చేసామని మిగతా రోడ్డు నిర్మాణం త్వరలో పూర్తి చేస్తానని వారు తెలిపారు భవనము 20 లక్షల రూపాయలు డ్వాక్రా భవనము వర్క్ షెడ్ నిర్మాణ పనులకు కేటాయించారు20 లక్షల రూపాయలతో గ్రామపంచాయతీ భవనమ నిర్మాణ పనులు చేసేందుకు శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ నిధులు కేటాయిస్తే త్వరలో పనులు ప్రారంభిస్తామని వారు తెలిపారు గ్రామ ఉపసర్పంచ్ వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లా మండల స్థాయి అధికారుల అందరి సహకారంతో తిన్న గోల్కొంద గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తయారు చేసే విధంగా కృషి చేస్తున్నానని వారు తెలిపారు గ్రామ సర్పంచ్ బసెట్టి విశాల సంగమేశ్వర్ తెలిపారు గ్రామంలో అసంపూర్తిగా ఉన్న దుర్గామాత దేవాలయాన్ని .పునర్నిర్మాణం చేసి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం స్పీకర్ చేతుల మీదుగా అంగరంగ వైభవంగా నిర్వహించామన్నారు. గ్రామస్తుల వార్డు సభ్యుల సహకారంతో అన్ని వర్గాల ప్రజలు రాజకీయాలకతీతంగా సహకరించడం వల్లే దుర్గాదేవి విగ్రహ ప్రతిష్టాపన ఘనంగా నిర్వహించుకున్నాము

## ప్రధాని మోదీ బీసీలపై స్పష్టమైన ప్రకటన చేయాలి

- బీసీ కుల గణనపై కేంద్రం సానుకూల నిర్ణయం ప్రకటించాలి
- బీసీలను విస్మరిస్తే తెలంగాణలో డబుల్ ఇంజన్ సర్కార్ ఒక కలగానే మిగిలిపోతుంది
- జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్

**తాండూరు మే 9(జనంసాక్షి** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 10వ తేదీన తెలంగాణ రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో బీసీల న్యాయబద్ధమైన హక్కుల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు, తాండూర్ బీసీ సంఘం కన్వీనర్ కందుకూరి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు.శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీలకు రాజకీయంగా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. శాసనసభలు, స్థానిక సంస్థలు మరియు ఇతర ఎన్నికల వ్యవస్థల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు ప్రత్యేక సబ్‌కోటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలని సూచించారు.అదేవిధంగా దేశవ్యాప్తంగా బీసీ కుల గణనపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం ప్రకటించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం బీసీలకు ప్రకటించిన 42 శాతం రిజర్వేషన్లకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.బీసీ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ దేశాన్ని నడిపించడం గర్వకారణమని పేర్కొన్న ఆయన, ఆదివారం హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభలో తెలంగాణ బీసీలకు రాజకీయ రిజర్వేషన్లపై స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. బీసీల కోసం రాజకీయ ప్రకటనలు లేకుండా కేవలం డబుల్ ఇంజన్ సర్కార్ నినాదంతో ముందుకు వెళితే తెలంగాణలో అది కలగానే మిగిలిపోతుందని అన్నారు.

## లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మించాలని
### రాష్ట్ర రక్షణ సేనపార్టీ జండా పట్టి కదిలిన నాయకురాలు కవిత



జిల్లేడు చౌదరిగుడా (జనంసాక్షి) పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల్లో భాగంగా లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మించాలని నాయకులు ప్రభుత్వని కోరుతున్నారు. గత ప్రభుత్వం హామీలు ఇచ్చి చేతులు దులిపేసుకుంది ఈ ప్రభుత్వం వచ్చాక కచ్చితంగా లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మిస్తుందని అందరూ భావించారు కనీసం భూ సర్వే కూడా ఇప్పటివరకు జరగలేదు శుక్రవారం నా డు టిఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత జిల్లేడు చౌదరిగుడా మండల కేంద్రంలో రైతు వేదిక దగ్గర పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల సాధన సభ నిర్వహించారు ఇందులో భాగంగా కవిత మాట్లాడుతూ: ఆంధ్రా వాళ్ళు ఉన్నప్పుడు నీళ్ళు, నియామకాలలో, మనకు మోసం జరిగిందని వాళ్లని తరిమికొట్టాం గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక నక్కజిత్తులోడు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉండేవారు ఆయనకు అప్పుడు లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ చేపట్టాలని అన్ని పూర్తిగా వివరంగా అప్పగించాం తను కమిషన్లు దండుకొని గాలికి వదిలేశాడని పేర్కొన్నారు.రాష్ట్ర రక్షణ సేన పార్టీ ప్రభుత్వంపై మాట్లాడుతుంది లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మించకుంటే పా లమూరు ప్రాంతమంతా పాదయాత్ర చేసి ఈ ప్రభుత్వం గద్దె దింపడానికి వెనకాడనని పేర్కొన్నారు పాలమూరు అధ్యయన వేదిక : రాఘవచారి, రాష్ట్ర జేఏసీ చైర్మన్ రాజేందర్ రెడ్డి, లు మాట్లాడుతూ. పాలమూరు జిల్లాలో ప్రజలను మోసం చేస్తున్నారు ఈ ప్రాంత గిరిజన రైతులు నీళ్లు లేక వ్యవసాయం చేయలేక వలసలు పోతున్నారు ఒకనాడు తాండాలంతా తిరిగి నిజనిర్ధారణ కూడా చేపట్టాం ఇక్కడి ప్రజలకు ఏమి కావాలాయా అని అడిగితె ప్రతి ఒక్కరి నోట వచ్చే ది నీరు కావాలనే చెప్తారు ప్రభుత్వాల దృష్టికి ఎన్నిసార్లు తీసుకొచ్చిన పట్టించుకోవడం లేదు లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ పేరు చెప్పుకొని ముఖ్యమంత్రిలు ఎమ్మెల్యేలు గెలిచారు వారు కనీసం బాధ్యత కూడా తీసుకోలేకపోయారు ఇక్కడి రైతులను ఆదుకోవాలంటే లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నిర్మాణం ఒకటే అది చేయకపోతే ఈ ప్రభుత్వాన్ని కూడా ప్రజలు గద్దె దింపుతారని పేర్కొన్నారు.

## పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్‌లో సమ్మర్ క్యాంప్ 11 నుండి ప్రారంభం



కోట్ పల్లి మే 09(జనం సాక్షి): పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోట్ పల్లి ప్రభుత్వ సమ్మర్ క్యాంప్ నిర్వహణకు ఎంపికైంది. ఈ నెల 11న క్యాంప్ ప్రారంభోత్సవం జరగనుంది. మండల విద్యాధికారి చంద్రప్ప తెలిపిన వివరాల ప్రకారం.11-05-2026 నుండి 25-05-2026 వరకు 15 రోజులపాటు ఈ క్యాంప్ నిర్వహిస్తారు. ప్రతిరోజూ ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమాలు కొనసాగుతాయి. విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు.అర్హత 6 నుండి 9వ తరగతి విద్యార్థులు. మండలంలోని ఏ పాఠశాల విద్యార్థులైనా పాల్గొనవచ్చు.కార్యక్రమాలు డ్రాయింగ్ పెయింటింగ్, క్విజ్, ఇండోర్-అవుట్‌డోర్ గేమ్స్, ల్యాబ్ ఎక్స్‌పెరిమెంట్స్, స్టోరీటెల్లింగ్, గుడ్ హ్యాండ్‌రైటింగ్, మాక్ పార్లమెంట్, కంప్యూటర్ రీడింగ్, ఎలక్ట్రీషియన్ ప్రాథమిక అవగాహన, టైలరింగ్, ఎన్విరాన్‌మెంటల్ యాక్టివిటీస్, ఎలక్యూషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల పోటీలు, యోగా-మెడిటేషన్, ఆర్ట్స్ క్రాఫ్ట్స్.ప్రయోజనాలు కొత్త నైపుణ్యాల అభ్యాసం, సృజనాత్మకత పెంపు, ఆత్మవిశ్వాసం, కొత్త స్నేహితులు, వినోదంతో కూడిన విద్య.ప్రారంభోత్సవానికి ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరుకానున్నారు. తరగతి ఉపాధ్యాయులు ఫోన్, వాట్సాప్ ద్వారా విద్యార్థులకు సమాచారం అందించాలని మండల విద్యాధికారి చంద్రప్ప కోరారు. వివరాలకు పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్, కోట్ పల్లిని సంప్రదించగలరు.

# మీ సమస్యలను పరిష్కరిస్తాం

- ఉప్పల్ భగాయత్ - రామంతాపూర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విస్తృత పర్యటన
- డ్రైనేజీ, రోడ్లు, వీధి దీపాలు, భద్రత, కమ్యూనిటీ హాల్, బస్టాప్ మార్పు తదితర సమస్యలపై త్వరిత చర్యలకు హామీ
- కాలనీవాసుల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులకు కీలక ఆదేశాలు



**ఉప్పల్, మే 9 (జనం సాక్షి):** ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించే లక్ష్యంతో బండారి లక్ష్మారెడ్డి ఈరోజు రామంతాపూర్ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ కాలనీతో పాటు ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండిఏ లేఔట్ వెస్ట్ ఫేజ్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు కాలనీల్లో తిరుగుతూ ప్రజలతో నేరుగా మాట్లాడిన ఎమ్మెల్యే, అక్కడి మౌలిక సదుపాయాల పరిస్థితిని పరిశీలించి సంబంధిత అధికారులకు పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ప్రజల సమస్యలను కార్యాలయాలకు పరిమితం కాకుండా నేరుగా కాలనీలకు వెళ్లి తెలుసుకోవాలనే ఉద్దేశంతో ఈ పర్యటన చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా చూడడం ద్వారా వాటికి శాశ్వత పరిష్కారం చూపించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ప్రతి కాలనీ అభివృద్ధి చెందాలంటే ప్రజలతో నిరంతరం మమేకం కావడం అవసరమని ఆయన అన్నారు.మొదటగా రామంతాపూర్ డివిజన్ పరిధిలోని గణేష్ నగర్ కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాలనీ వీధుల్లో నడుచుకుంటూ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పెద్ద సంఖ్యలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించారు. ముఖ్యంగా కాలనీలో చాలాకాలంగా కొనసాగుతున్న డ్రైనేజీ సమస్య వల్ల వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని, దుర్వాసనలు వ్యాపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కొన్నిచోట్ల డ్రైనేజీ లైన్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, వర్షాలు పడినప్పుడు ఇళ్లలోకి కూడా నీరు చేరుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని అంతర్గత రోడ్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయని, చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు, ఇతర వాహనాలు రావడానికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రోడ్ల మరమ్మతులు చేపట్టేలా అధికారులకు సూచనలు జారీ చేశారు. అలాగే కాలనీలో ఉన్న డంపింగ్ యార్డ్ కారణంగా దోమలు, దుర్వాసనలు పెరిగి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, చిన్నపిల్లలు మరియు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో చెత్త పేరుకుపోతోందని, దీనివల్ల వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కాలనీలో పాతబడిపోయిన కమ్యూనిటీ హాల్ స్థానంలో ఆధునిక సదుపాయాలతో కొత్త కమ్యూనిటీ హాల్ నిర్మించాలని స్థానికులు ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. వివాహాలు, సమావేశాలు, సామాజిక కార్యక్రమాలకు సరైన వేదిక లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత శాఖలతో చర్చించి కొత్త కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే పాలిటెక్నిక్ సమీపంలో ఉన్న బస్టాప్‌ను విశాల్ దగ్గరకు మార్చాలని ప్రజలు కోరారు. ప్రస్తుతం ఉన్న బస్టాప్ కారణంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రహదారి దాటేందుకు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. దీనిపై ట్రాఫిక్ మరియు రవాణా శాఖ అధికారులతో మాట్లాడి సాధ్యమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్ నెంబర్-1లో కొందరు మద్యం సేవించి కాలనీలో న్యూసెన్స్ సృష్టిస్తున్నారని, రాత్రివేళల్లో మహిళలు మరియు కుటుంబ సభ్యులు బయటకు రావడానికి భయపడుతున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీలో రోజువారీ పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించి స్థానిక పోలీసు అధికారులతో మాట్లాడి ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, "ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపించడం నా బాధ్యత. కాలనీల అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకువచ్చి మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తాం. ప్రజలు నన్ను ఎప్పుడైనా సంప్రదించవచ్చు. సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను" అని తెలిపారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వెంటనే జీహెచ్‌ఎంసీ ఏఈ శ్వేత, జలమండలి హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ ఏఈ రవీందర్‌లతో మాట్లాడి కాలనీలో పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, రోడ్లు మరియు ఇతర అభివృద్ధి పనులను త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. వర్షాకాలానికి ముందే అత్యవసర పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం ఎమ్మెల్యే ఉప్పల్ భగాయత్ హెచ్‌ఎండిఏ లేఔట్ వెస్ట్ ఫేజ్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. పలు అపార్ట్మెంట్లు, కాలనీ వీధులు, అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలను పరిశీలిస్తూ ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, వర్షాలు పడినప్పుడు కాలనీలో భారీగా నీరు నిలిచిపోతుందని, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని తెలిపారు. రోడ్లు పూర్తిగా దెబ్బతిని వాహనదారులు మరియు పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు.అలాగే కాలనీలో అనేక చోట్ల వీధి దీపాలు పనిచేయకపోవడంతో రాత్రివేళల్లో చీకటి నెలకొంటోందని, మహిళలు మరియు వృద్ధులు బయటకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని ప్రాంతాల్లో చెత్త సక్రమంగా తొలగించకపోవడంతో పారిశుధ్య సమస్యలు ఎక్కువయ్యాయని, దోమల వ్యాప్తి పెరిగిందని తెలిపారు. కాలనీలోని అంతర్గత రోడ్లు పూర్తిగా దెబ్బతిని వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.ప్రజల సమస్యలను ఓపికగా విన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, "తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా శాశ్వత పరిష్కారం దిశగా పనులు చేపడతాం. డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, రోడ్ల పునర్నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వర్షాకాలానికి ముందే అత్యవసర పనులను పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు ఇచ్చాం" అని తెలిపారు.ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను నేరుగా వివరించారు. సమస్యలు విన్న వెంటనే అధికారులతో మాట్లాడి స్పందించడం పట్ల కాలనీవాసులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల్లో తిరుగుతూ సమస్యలను తెలుసుకోవడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గణేష్ నగర్ కాలనీ మెంబర్లు అనిల్ కుమార్ (ప్రెసిడెంట్), పవన్ కుమార్ (వైస్ ప్రెసిడెంట్), నవీన్ పటేల్, జీవన్ రెడ్డి, రమేష్, వెంకట్ రెడ్డి, మ్యాతుస్, రామేశ్వరరావు, నాగేంద్ర బాబు పాల్గొన్నారు. అలాగే బీఆర్‌ఎస్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, గంథం నాగేశ్వరావు, కాలేరు నవీన్, రామసహాయం శ్రీనివాస్ రెడ్డి, సురం శంకర్, చాంద్ పాషా, బీఎన్ చారి, దయాకర్ రెడ్డి, బొసాని పవన్, సమీర్, శరత్, జాన్, ఆనంద్, బాలకృష్ణ తదితరులు హాజరయ్యారు.భగాయత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మేకల మధుసూదన్ రెడ్డి, శివప్రసాద్, డాక్టర్ రాఘవేందర్, శ్రీరామ్, సందీప్, విష్ణువర్ధన్ రెడ్డి, మల్లికార్జున్, కమల్, మహిపాల్, టీవీఎస్‌ఎస్ కృష్ణమూర్తి, ఆదిత్య, బాలకృష్ణ, నరోత్తం రెడ్డి, శేషాచారి, కృష్ణ, సందీప్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి తదితరులు, వాసవి మెట్రో పోలీస్ అపార్ట్మెంట్ వాసులు మరియు పలు అపార్ట్మెంట్ కమిటీ సభ్యులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయండి

### బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ మధుకర్ రెడ్డి




**యాచారం,మే 9(జనం సాక్షి )** తెలంగాణలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ పర్యటనను విజయవంతం చేయాలని బిజెపి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ మధుకర్ రెడ్డి అన్నారు. అనంతరం పెరేడ్ గ్రౌండ్స్ లో జరిగే భారీ బహిరంగ సభకు నరేంద్ర మోడీ హాజరవుతున్న నేపథ్యంలో యాచారం మండలంలోని ప్రతి గ్రామం నుంచి బిజెపి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పురుషోత్తం, నందివనపర్తి సర్పంచ్ రాయి కంటి విజయ్ కుమార్,సంతోష్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు

## నేడు జరిగే పీఎం మోడీ సభను విజయవంతం చేయండి



**మర్పల్లి మే 07 (జనంసాక్షి)** నేడు దేశ ప్రధాని నరేంద్ర మోడీ విచ్చేస్తున్న సందర్భంగా రాష్ట్ర రాజధాని సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మర్పల్లి మండల బిజెపి అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మర్పల్లి మండల కేంద్రంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం నుంచి భారీ జన సమీకరణ కోసం ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని, గ్రామాలలో సీసీ రోడ్లు కేంద్ర ప్రభుత్వం నిధులతోనే జరుగుతున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి అధికారం చేపట్టడం ఖాయమని, ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలలో మూడు రాష్ట్రాలను దైవసం చేసుకున్నది బిజెపి పార్టీ అని, పశ్చిమబెంగాల్ గత 15 రాక్షస పాలనకు ఆ రాష్ట్ర ప్రజలు విసికి 200 పైచిలుకు తో బిజెపికి పట్టం కట్టాలని అన్నారు. నేడు జరిగే సభకు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## మహారాణా ప్రతాప్ ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకం



**తాండూరు మే 9 (జనంసాక్షి)** మాతృభూమి విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి, అన్యాయంపై అలుపెరగని పోరాటం చేసిన వీర యోధుడు మహారాణా ప్రతాప్ అని ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తాండూరు పట్టణంలో ఆయన జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని మహారాణా ప్రతాప్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్బీఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ మహారాణా ప్రతాప్ ధైర్యసాహసాలు, దేశభక్తి నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కష్టకాలంలోకూడాఆత్మగౌరవం-న్ని వదులు కోకుండా పోరాడిన ఆయన ఆశయాలనుప్రతిఒకరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, యువకులు మరియు పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వీరయోధుడికి స్మరించుకున్నారు.

## ఉప్పల్ శ్రీరామ కాలనీలో

### రూ.34 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం



**ఉప్పల్ మే 09 ( జనం సాక్షి ):** ఉప్పల్ అభివృద్ధి పనులను పరిశీలించిన మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న పనులను మాజీ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం ఆయన ఉప్పల్ శ్రీరామ కాలనీలో విస్తృతంగా పర్యటించి కాలనీ ప్రజలతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. రూ.34 లక్షల వ్యయంతో చేపడుతున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనుల పురోగతిని అధికారులు, స్థానికులతో కలిసి సమీక్షించారు.కాలనీలో ప్రతి వర్షాకాలంలో ఎదురయ్యే డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు కొత్త డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేస్తున్నట్లు రజిత పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. డ్రైనేజీ పనులు పూర్తయ్యిన వెంటనే సీసీ రోడ్ల నిర్మాణాన్ని కూడా వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జరగాలని అధికారులకు సూచించారు. స్థానికులు కూడా కాలనీలో చేపడుతున్న పనులపై సంతృప్తి వ్యక్తం చేస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో బావికాడి సత్తిరెడ్డి, రాఘవేందర్ గుప్తా, మధుచారి, రాజు రవీందర్ రెడ్డి, సల్లా ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సోమ మల్లేష్, దర్పరెడ్డి, చంద్రశేఖర్, కిశోర్, సోమ బాలమణి, సాయిబాబి, మలమ్మ, ప్రభావతి, యాదమ్మ, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి అడుగడుగునా అడ్డంకులు

- మాకుటుంబానికి మిత్రునాయక్‌తో ప్రాణహాని
- బషీర్‌మీయా తాండా గ్రామ సర్పంచ్ వర్త్య మీనాక్షి



**తాండూరు మే 9 (జనంసాక్షి )** గ్రామ అబివృద్ధికి అడుగడుగునా మాజీ సర్పంచ్ మిత్రు నాయక్ అడ్డంకులు సృష్టించారని బషీర్‌మీయా తాండా గ్రామ సర్పంచ్ వర్త్య మీనాక్షి పేర్కొన్నారు. తాండూరు నియోజకవర్గం యాలాల మండలం బషీర్‌మీయా తాండా గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించిన ఘటనలో యాలాల పోలీసులు వేగంగా స్పందించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామ సర్పంచ్ వర్త్య మీనాక్షి మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న అనర్థాలపై మాజీ సర్పంచ్ మిత్రు నాయక్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. సర్పంచ్‌ఎన్నికల్లో ఓటమిని బరించలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, బదలాంచేయడం సరికాదన్నారు. నిందలు మోపాలని ట్రాక్టర్ చోరిచేశారు. నిజనిజాలు బయటపడ్డాయని వేల్లడించారు

వారం రోజుల క్రితం గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను కొంతమంది యువకులతో కలిసి దొంగిలించారని, ట్రాక్టర్ కనిపించక పోవడంతో యాలాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే దర్యాప్తు చేపట్టిన పోలీసులు యువకులను అదుపులోకి తీసుకుని విచారించగా, మాజీ సర్పంచ్ మిత్రు నాయక్ సూచనలతో ట్రాక్టర్‌ను ఎత్తుకెళ్లినట్లు వారు వెల్లడించినట్లు చెప్పారు.దీంతో మాజీ సర్పంచ్ మిత్రు నాయక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు తెలిపారు. అలాగే గ్రామంలో గతంలో ఒక వ్యాపారవేత్త ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కొద్ది రోజులకే గ్రామం నుంచి తొలగిపోయి ఒకరి ఇంటికే పరిమితమయ్యాయని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించిన తలుపులు కూడా దొంగిలించి తమ నివాసంలో ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు బషీర్‌మీయా తాండా పరిధిలోని సర్వే నెంబర్ 64లో ఎలాంటి అనుమతులు లేకుండా ఎర్రమట్టి తవ్వకాలు నిర్వహిస్తూ లక్షలాది రూపాయలు సంపాదిస్తున్నారని సర్పంచ్ ఆరోపించారు..అనుమతులు లేకుండా జరుగుతున్న ఎర్రమట్టి తవ్వకాలపై ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి, సర్వే నెంబర్ 64 భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవాలని సర్పంచ్ వర్త్య మీనాక్షి డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సీనియర్ నాయకులు వర్త్య శ్రీనివాస్, ఉపసర్పంచ్ సంతోష్, వార్డ్ సభ్యులు చందు నాయక్, తులసిబాయి, గద్యే నాయక్, కోట చందు, వర్త్య మోహన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



గీత పారిశ్రామిక సహకార సంస్థ నూతన వైస్ చైర్మన్ నియమించబడ్డ కేశం నాగరాజు గౌడ్‌ను వారి నివాసంలో టిపిసిసి జాయింట్ సెక్రెటరీ చామకూరి శ్రీధర్ గౌడ్, సూర్యాపేట కాంగ్రెస్ నాయకులు చౌగాని రామాంజనేయులు గౌడ్, పల్లె వెంకటేశ్వర్లు గౌడ్‌లు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**హయత్ నగర్, మే 09 (జనంసాక్షి)**

## మండల వివోఏల కమిటీ అధ్యక్షుడిగా నర్సింలు



**మర్పల్లి మే ,(జనంసాక్షి)** మర్పల్లి మండల వివోఏ ల నూతన కమిటీని శనివారం ఎన్నుకొన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వివోఎల సమావేశంలో అధ్యక్షులు కే. నర్సి ములు కోట మర్పల్లి, కార్యదర్శి గౌరమ్మ ఘనపూర్, కోశాధికారిగా బాలకృష్ణ కొత్లపురం, ఉపాధ్యక్షులుగా సునీత నర్సాపూర్ మల్లికార్జునగిరి, సహాయ కార్యదర్శులుగా సుమన్, శకుంతల మర్పల్లి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని నర్సిములు తెలిపారు.

### శంకర్ నగర్ కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభించిన

# ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి




**హయత్ నగర్ మే 09 (జనం సాక్షి)** హయత్ నగర్ డివిజన్ పరిధి లోని శంకర్ నగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన ముఖద్వారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించి, కాలనీవాసులకు శుభాకాంక్షలు తెలిపారు. శంకర్ నగర్ కాలనీ, పరిసర కాలనీ సంక్షేమ సంఘాల వారు ఎమ్మెల్యే కి కాలనీ సమస్యల పరిష్కారానికై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ అభివృద్ధి కోసం ముందుకు వచ్చి ముఖద్వారం నిర్మాణానికి సహకరించిన నక్క శంకర్ గౌడ్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఈ కాలనీలో డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణ పనులు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. కాలనీలో ఇంకా ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాలనీ వాసులందరూ ఐక్యమత్యంగా కలిసి ఉండాలని, అందరూ సమిష్టిగా ఉంటే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్, మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరి రెడ్డి, జక్కిడి రఘువీర్ రెడ్డి, నక్క దర్శన్ గౌడ్, చంద్రారెడ్డి, రాంచంద్ర రెడ్డి, కాలనీ గౌరవ అధ్యక్షులు పెల్లకూరి సుబ్బారెడ్డి, అధ్యక్షులు యాకల రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి కేమ జనార్దన్, సంక్షేమ సంఘం సభ్యులు నర్సిరెడ్డి, అంజయ్య, రాంరెడ్డి, సునీల్, సత్యనారాయణ, మల్లయ్య, మల్లేశం, రాజారామ్, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## రోహిణి కార్తె ప్రారంభం ఎప్పుడు..?




**మహబూబాబాద్ ప్రతినిధి, మే 9 (జనం సాక్షి):** తెలుగు రాష్ట్రాల్లో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. మే నెల రెండో వారంలోనే భానుడు తన ప్రతాపం చూపిస్తుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 45 నుంచి 46 డిగ్రీల వరకు నమోదవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో "రోహిణి కార్తె" పేరు వినగానే ప్రజల్లో ఆందోళన నెలకొంటోంది. సాంప్రదాయంగా రోహిణి కార్తెలో ఎండలు అత్యంత తీవ్రంగా ఉంటాయని పెద్దలు చెబుతుంటారు. "రోహిణి కార్తెలో రోళ్లు కూడా పగిలిపోతాయి" అనే నానుడి ఈ వేడి తీవ్రతను సూచిస్తుంది. 2026 సంవత్సరంలో రోహిణి కార్తె మే 25 నుంచి జూన్ 2 వరకు కొనసాగనుంది. ఈ కాలంలో తీవ్రమైన ఎండలు, వడగాల్పులు, ఉక్కపోత, అగ్నిప్రమాదాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. జ్యేష్ఠ మాస శుక్ల పక్షంలో సూర్యుడు రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించే సమయం నుంచి వేడి ప్రభావం మరింత పెరుగుతుంది. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలై మధ్యాహ్నం సమయానికి బయటకు రావడం కూడా కష్టంగా మారుతుంది. ప్రధాన రహదారులు కూడా జనసంచారం లేక వెలవెలబోతున్నాయి. వైద్యులు ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచిస్తున్నారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా తరచూ ద్రవపదార్థాలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. రోహిణి కార్తెలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మట్టికుండ నీళ్లు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవాలి. రాగి జావ, గ్లూకోజ్, ఓఆర్ఎస్ వంటి ద్రవపదార్థాలు ఉపయోగకరం. మసాలా, ఎక్కువ ఆయిల్, వేపుళ్లు, పచ్చళ్లు వంటి ఆహారాలను తగ్గించాలి. రోజుకు కనీసం రెండు సార్లు స్నానం చేయడం మంచిది. తెలుపు లేదా లేత రంగుల కాటన్ దుస్తులు ధరించాలి. చిన్నపిల్లలను తడి గుడ్డతో తుడిచి శరీర ఉష్ణోగ్రతను తగ్గించాలి. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం 12 నుంచి 4 గంటల మధ్య బయటకు వెళ్లకూడదు. బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ లేదా తడి గుడ్డ వాడాలి. మానవత్వం చాటుదాం ఎండ తీవ్రతలో పశు, పక్ష్యాదులకు తాగునీరు ఏర్పాటు చేయాలి. ఇంటి ముందు నీటి పాత్రలు ఉంచడం ద్వారా మూగజీవాలకు ఉపశమనం కలిగించవచ్చు. అలాగే బాటసారులకు చల్లని నీరు అందించడం కూడా మంచి సేవగా భావించాలి.



బానోత్ రామన్న నాయక్
జనం సాక్షి జిల్లా ప్రతినిధి,
మహబూబాబాద్ జిల్లా.

# బాచుపల్లి పెద్ద చెరువులోకి మురుగు నీరు పై అధికారులు చర్యలు చేపట్టాలి

నిజాంపేట్ మే 9( జనం సాక్షి) బాచుపల్లి ప్రాంతంలోని ఎంతో ప్రాచుర్యం చెందిన సుమారు 50 ఎకరాల విస్తీర్ణం కలిగిన మంచినీరు గల పెద్ద చెరువులోకి మురుగు నీరు కలుస్తుండటంపై ఎవ్వరూ చర్యలు చేపట్టకపోవడం తో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని సామాజిక కార్యకర్త ఆకుల సతీష్ తెలిపారు. 2024 సెప్టెంబర్ నెల నుంచి ఇప్పటివరకు దాదాపు నాలుగు నుండి ఐదు సార్లు డ్రైనేజ్ లైన్ మాన్‌హోల్స్ పగిలిపోవడంతో భారీగా మురికినీరు చెరువులోకి చేరినట్లు ఆయన ఆరోపించారు. ప్రతి సారి తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టడం వల్ల సమస్య మళ్లీ మళ్లీ పునరావృతమవుతోందని ఆయన పేర్కొన్నారు. ఒకప్పుడు మంచినీటి చెరువుగా ఉన్న ఈ చెరువు ప్రస్తుతం మురుగు నీటి చెరువుగా దుర్గంధం వాసన చెత్త చెదారం తో మారుతున్న పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.దీని వలన:చెరువు పర్యావరణ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటోందని పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వ్యాపిస్తోందని ప్రజారోగ్యానికి ముప్పు ఏర్పడుతోందని భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆకుల సతీష్ తెలిపారు. ఈ ఘటనలకు నిజాంపేట్ డిప్యూటీ కమిషనర్ ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఆయన ఆరోపించారు. పలు మార్లు సమస్య పునరావృతమైనప్పటికీ శాశ్వత పరిష్కారం చేపట్టకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సంబంధిత అధికారులను చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు: డ్రైనేజ్ మాన్‌హోల్స్ పైపులైన్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని మురుగునీరు చెరువులోకి చేరకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్లక్ష్యం వహించిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. చెరువు పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు ,ప్రజారోగ్యం పర్యావరణ పరిరక్షణ విషయంలో అధికారులు తక్షణమే స్పందించాలని ఆకుల సతీష్ కోరారు.



## అత్తాపూర్ గ్రామంలో మహావీర్ ఆస్పత్రి ఉచిత చికిత్సక్యాంపును ప్రారంభించిన గ్రామ సర్పంచి మేకల సంతోష్ రెడ్డి



**నవాబుపేట్ మే 9 (జనం సాక్షి )** వేసవికాలంలో వివిధ గ్రామ ప్రజలు ఉపాధి హామీ కూలి పనికి వెళ్లి అనారోగ్యంతో బాధపడకుండా ఉండటానికి వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఉన్నటువంటి మహావీర్ ఆసుపత్రి ఉచిత క్యాంప్ నవాబ్పేట్ మండల పరిధిలోని అత్తాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన సందర్భంగా పేద ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆలోచనతో శనివారం అత్తాపూర్ గ్రామంలో గ్రామ సర్పంచ్ మేకల సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలందరికీ వికారాబాద్ జిల్లా పరిధిలో ఉన్నటువంటి మహావీర్ ఆస్పత్రి వైద్య అధికారులచే మాట్లాడి గ్రామంలో ఉన్నటువంటి పేద ప్రజలందరికీ వైద్య శిబిరాన్ని అందించి వారికి కావలసినటువంటి వైద్యాన్ని అందించి సేవలు చేయాలని వారు కోరినారు. గ్రామ సర్పంచి సంతోష్ రెడ్డి కోరికల మేరకు వికారాబాద్ మహావీర్ ఆస్పత్రి సూపర్డెంట్ ఆధ్వర్యంలో ఇన్చార్జి రమేష్ ఆధ్వర్యంలో ఈ క్యాంపు ను నిర్వహించి అత్తాపూర్ గ్రామంలో 110 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులు ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నవి వారికి అందించారు వారికి కావలసిన సదుపాయాలను సోమవారం ఆస్పత్రికి వచ్చినట్లయితే వారికి సరిపడా వైద్య పరీక్షలు అందించి వారికి ఎలాంటి సదుపాయాలు ఉన్న వారిని వారికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తామని రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహావీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆధ్వర్యంలో వికారాబాద్ పట్టణంలో ప్రముఖ వైద్య సంస్థ అయినా మహావీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ జనరల్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో పరిసరాల గ్రామం ప్రజలకు సమగ్రమైన నాణ్యమైన అంకితభావంతో కూడిన స్పెషాలిటీ మరియు ఆరోగ్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా అని ప్రారంభించిన సంపూర్ణ ఆరోగ్య కేంద్రం మహావీర్ ఆసుపత్రి. అత్యధిక పరికరాలు,అనుభవాగ్నైన వైద్యులు, నిప్పునుల పర్యవేక్షణలో 24 గంటల అత్యవసర వైద్య సేవల, ఆపరేషన్ థియేటర్, ఐ,సీ,యూ, ల్యాబ్, అన్ని రకాల స్కాన్లు ఇతర సేవలు మా వద్ద అందించడం ఉన్నాయని ఇన్చార్జి రమేష్ పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఉన్నటువంటి మహావీర్ ఆస్పత్రిలో ఎలాంటి హానికరం ఉన్న వివిధ గ్రామ ప్రజలు అందుబాటులోకి వచ్చి మా యొక్క ఆరోగ్య సేవలు అందుకోవాలని వారు పేర్కొన్నారు. వైద్య నిపుణుల సేవలు, జనరల్ మెడిసిన్, ఆర్తోపెడిక్, అత్త మూలాజీ కంటి వైద్యనిపులు, ఈ ఎన్ టి ( ముక్కు చెవి గొంతు ), జనరల్ సర్జరీ, పీడియాట్రిక్, ( చిన్నపిల్లలు ) గైనలజీ ( స్త్రీల సమస్యలు ), మానసిక ఆరోగ్య సమస్యలను వివిధ గ్రామ ప్రజలందరూ ఆసుపత్రికి హాజరై మీ యొక్క సమస్యలను విన్నవించి సమస్యలు తీర్చుకోగలరని రమేష్ పేర్కొన్నారు. మావిర్ ఆస్పత్రిలో గత మూడు నెలల నుండి కంటి వైద్య నిపుణులు పేర్కొన్న సందర్భంగా కంటిలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వారికి అనువైన సందర్భంగా 500 రూపాయలు తో వారికి వైద్యం సేవలు అందిస్తామని డాక్టర్లు పేర్కొన్నారు. అత్తాపూర్ గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ ఒక చిన్న గ్రామంలోని పేద ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అగుబడిన మందులు ఇంజక్షన్లు ఇచ్చి వారిని ఆదుకోవాలని సర్పంచ్ పేర్కొన్నారు. ఆయన మాట్లాడిన ఆదేశాల మేరకు మావిర్ ఆస్పత్రి సూపర్డెంట్ వెంటనే వారు సిబ్బందిని ఏర్పాటు చేసి చిన్న క్యాంపును ఏర్పాటు చేసి గ్రామ సమస్యల్లో ఉన్న పేద ప్రజలందరికీ ఉపాధి హామీ కూలీల పని చేసే ప్రతి ఒక్కరికి అందించే వారికి సరిపడ మందులు అందిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ పురేందర్, పంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, వార్డు సభ్యులు గ్రామ మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు యువజన సంఘాల నాయకులు డ్వాక్రా మహిళలు అంగన్వాడి టీచర్లు ఆశ వర్కర్లు గ్రామ పెద్దలు మాజీ సర్పంచులు ఉప సర్పంచ్లు వివిధ పార్టీ నాయకులు అధికారులు పాల్గొని యొక్క మావిర్ నిర్వచనం నుండి ఉచిత క్యాంపును సతినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు.

## నరేంద్రమోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు
# జనగ్రహ బహిరంగ సభ విజయవంతం చేయాలి

### చెవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం




**చేవెళ్ల, మే 09 (జనంసాక్షి)** ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం అన్నారు. నేడు హైదరాబాద్ నగరంలోని ఫెరేడ్ గ్రౌండ్లో నిర్వహించనున్న ప్రధాని నరేంద్రమోడీ జనగ్రహ బహిరంగ సభకు భారీగా తరలి వచ్చి, విజయవంతం చేయాలని బీజేపీ కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం పిలుపునిచ్చారు. శనివారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కేవీఆర్ భవనంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత మొదటిసారిగా తెలంగాణకు వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రూ.7 వేల కోట్లకు సంబంధించిన అభివృద్ధి పనులు శంకుస్థాపన చేస్తున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృ ద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించే వేదిక జనగ్రహ బహిరంగ సభ అని అన్నారు. చేవెళ్ల ఎంపీ.కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సూచించారు. ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. ప్రధాని బహిరంగ సభ సాయంత్రం ఫెరేడ్ గ్రౌండ్లో ఉంటుందన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఆందిస్తున్న సహకారాన్ని ప్రజలకు తెలియజేయడానికి ఈ సభ మంచి అవకాశం అని స్పష్టం చేశారు. కెసిఆర్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరు హామీలను అమలు చేయడం లేదని, ప్రభుత్వం ఉద్యోగాలకు జీతం సరిగా ఇవ్వలేకపోతుందని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు, ఆభిమానులు పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పని అయిపోయిందని దేశ ప్రజలు ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని కోరుతున్నారని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు అత్తేల్లి అనంత్ రెడ్డి, జిల్లా యువ నాయకుడు డా.వైభవ్ రెడ్డి, మాజీ సర్పంచ్ సామ మాణిక్యరెడ్డి, మండల నాయకులు పత్తి సత్యనారాయణ, వెంకట్రామ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మధుకర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, అభిశేఖర్ రెడ్డి, జైపాల్ రెడ్డి, రిషికేశ్, ఉమాశంకర్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

## పరేడ్ గ్రౌండ్ బహిరంగ సభను విజయవంతం చేయాలి

### కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి బస్వ పాపయ్య గౌడ్




**మహేశ్వరం,మే9(జనంసాక్షి):** నేడు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొనే భారీ బహిరంగ సభకు బీజేపీ శ్రేణులు భారీ ఎత్తున పాల్గొనాలని బిజేపి కిసాన్ మోర్చా జాతీయ కార్యదర్శి బస్వ పాపయ్య గౌడ్ పిలుపునిచ్చారు.మహేశ్వరం మండలం నుంచి 1500 మందిని సభలో పాల్గొంటారన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్ రెడ్డి,మండల అధ్యక్షుడు యాదిష్,నాయకులు పోతర్ల సుదర్శన్ యాదవ్,కాసాని వెంకటేష్ గౌడ్,బుగ్గని శంకర్,పాండు నాయక్,దేవేందర్ నాయక్,రఘు,ప్రకాష్,మహేష్, సుధీర్ పలువురు బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కోకాపేటలో సెల్ఫ్ ఎన్యూమరేషన్‌పై అవగాహన వాకథాన్



**రాజేంద్రనగర్,మే9(జనంసాక్షి)** నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేటలో ప్రజల్లో సెల్ఫ్ ఎన్యూమరేషన్‌పై అవగాహన కల్పించేందుకు వాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేర్లింగంపల్లి జోనల్ కమిషనర్ జయేశ్ రంజాన్ పాల్గొని వాకథాన్‌లో నడిచారు. ఈ సందర్భంగా ఆయన వాకర్లతో పాటు స్థానిక నివాసితులతో మాట్లాడి సెల్ఫ్ ఎన్యూమరేషన్ యొక్క ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ప్రతి పౌరుడు స్వచ్ఛందంగా ఈ ప్రక్రియలో పాల్గొని వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డి, డిఈ సంజయ్, లచ్చిరాం, మాజీ కౌన్సిలర్ అమరేందర్ రెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మే 11 నుంచి మోడల్ స్కూల్లో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

### అవకాశం సద్వినియోగం చేసుకోవాలి

### మండల విద్యాధికారి పురందాస్

**చేవెళ్ల, మే 09 (జనంసాక్షి)** తెలంగాణ ఆదర్శ పాఠశాల చేవెళ్ళ లో ఈ నెల 11 వ తేదీ నుండి 25 వ తేదీ వరకు సమ్మర్ క్యాంప్ ( వేసవి శిక్షణ శిబిరం) ఏర్పాటు చేస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నప్పరెడ్డి, మండల విద్యాధికారి పురందస్ తెలిపారు. ఇట్టి సమ్మర్ క్యాంప్ లో 6వ తరగతి నుండి 9 వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడానికి అర్హులన్నారు. ఈ సమ్మర్ క్యాంప్ లో 100 మంది విద్యార్థులు పాల్గొనడానికి అవకాశం ఉందని, ఇందులో చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, యోగా, కరాటే, కంప్యూటర్ శిక్షణ, పర్సనాలిటీ డెవలప్మెంట్, సైన్స్ ప్రయోగాలు, క్విజ్ మొదలైన అంశాలు ఉంటాయని తెలిపారు. ఈ క్యాంప్ లో పాల్గొనే విద్యార్థులకు ప్రతి రోజు అల్ప అహారం అందజేస్తారని మండల విద్యఅధికారి పురందాస్ అన్నారు. విద్యార్థులలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు, సామాజిక అవగాహన మొదలైన లక్షణాలు పెంపొందించడానికి ఈ సమ్మర్ క్యాంప్ దోహదపడుతుంది అని అన్నారు. మండలంలోని 6 వ తరగతి నుండి 9 వ తరగతి చదివే విద్యార్థులు ఎవరైనా ఇట్టి సమ్మర్ క్యాంప్ లో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ప్రవేశం పొందడానికి తెలంగాణ ఆదర్శ పాఠశాల చేవెళ్ళ లో సంప్రదించాలని పాఠశాల ప్రిన్సిపల్ కోరారు. ఈ ప్రవేశం పొందడానికి విద్యార్థి పాస్ పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సంప్రదించాలని ప్రిన్సిపాల్ చిన్నప్ప రెడ్డి తెలిపారు.

# ప్రజాసేవలో మంత్రి పొన్నం ఓఎస్డీ దొర్న వేణు

**హైదరాబాద్, మే 9 (జనంసాక్షి):**
తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ఓఎస్డీగా పనిచేస్తున్న దొర్న వేణు తనదైన ప్రత్యేక పనితీరుతో గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఆర్టీసీ సంస్థలో డిపో మేనేజరుగా తన ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి ఎన్నో ఏళ్ల అనుభవం కలిగిన ఆయన పదవీ విరమణ తర్వాత కూడా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వద్ద ఓఎస్డీగా పని చేస్తూ ప్రజాసేవలోనే కొనసాగుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ వద్దకు వచ్చే వారి పని ఏంటో స్వయంగా తెలుసుకొని... ఆ పనులను మంత్రికి నివేదించి తన శాఖ మంత్రి పొన్నంకి మంచిపేరు తీసుకువచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు.

రవాణా శాఖ, ఆర్టీసీకి సంబంధించిన సమస్యల పరిష్కారంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు దొర్న వేణు కీలక సహకారం అందిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవల జరిగిన ఆర్టీసీ సమ్మె సమయంలో తన అనుభవంతో ఇటు మంత్రికి... అటు ఆర్టీసీ సంస్థ ఉన్నతాధికారులు. కార్మికులకు తన సూచనలు అందజేసి చేసి పరిస్థితులను చక్కదిద్దడంలో కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. సాధారణంగా మంత్రుల కార్యాలయాల్లో పని చేసే ఓఎస్డీ, పీఎస్, అడిషనల్ పీఎస్, పీఏలు ప్రజలకు అందుబాటులో ఉండరని పెద్ద ఎత్తున విమర్శలు ఉన్నాయి. కొంతమంది మంత్రుల పీఏలు, ఓఎస్డీ, పీఎస్, అడిషనల్ పీఎస్ ప్రతి ఫైల్ కి ఒక రేటు చెబుతూ మంత్రులకు చెడ్డ పేరు తెస్తున్నారు. అయితే, మంత్రి పొన్నం ప్రభాకర్ ఓఎస్డీ దొర్న వేణు మాత్రం సామాన్యులకి మంచి చేయాలన్న సంకల్పశీతో తన



నాయకుడు, మంత్రి దృక్పథంను అమలు పరుస్తూ అందరికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. న్యాయమైన అంశాలలో బాధితులు ఎటువంటి సిఫార్సులు లేకపోయినా మంత్రి పేషీకి వచ్చే సామాన్య ప్రజల సమస్యలు ఓర్పుగా విని మంత్రి దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తున్నారు. ఆ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. మంత్రి నియోజకవర్గం హుస్నాబాద్ నుండి ఎవరు ఫోన్ చేసినా... ఫోన్ కాల్స్‌కూ కూడా వెంటనే స్పందిస్తూ అందరికీ అందుబాటులో ఉంటున్నారని తెలుస్తోంది. సామాన్యశీగా మంత్రుల ఆఫీసులో ఫైళ్ల కదలికల కోసం డబ్బులు తీసుకుశీటారనే ఆరోపణలు వినిపించే ఈ కాలంలో తన మంత్రి పొన్నం ప్రభాకర్ కోసం దొర్న వేణు నిజాయితీతో పనిచేస్తూ మంచి పేరు సంపాదించుకుంటున్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆయనకు తన మాతృ సంస్థ ఆర్టీసీలోనూ మంచి గుర్తింపు ఉందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు.

## హెచ్‌ఎండిఏ పరిధిలో క్రైస్తవుల సమాధుల కోసం పది ఎకరాల భూమి కేటాయించాలి

- క్రైస్తవుల అభివృద్ధి కి కృషి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు.
- షాద్ నగర్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చించొడ్ దేవదాసు




**జనం సాక్షి (ఫరూఖ్ నగర్) :** హెచ్‌ఎండిఏ పరిధిలో క్రైస్తవుల సమాధుల కోసం పది ఎకరాల భూమి కేటాయించాలని, క్రైస్తవ అభివృద్ధి కోసం మైనార్టీ పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని షాద్ నగర్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చించొడ్ దేవదాసు అన్నారు. శనివారం నాడు షాద్ నగర్ పట్టణంలోని పెన్షనర్స్ భవన్ లో షాద్నగర్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్నగర్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చించోడు దేవదాసు మాట్లాడుతూ క్రైస్తవుల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి క్రైస్తవ సమాజం రుణపడి ఉంటుందని వివరించారు. ఏటా వందమంది క్రైస్తవ విద్యార్థులకు 20 లక్షల ఓవర్సీస్ స్కాలర్షిప్ ఇచ్చి విదేశాలకు పంపించడం ఎంతో అభినందనీయమని, కానీ కొంతమంది విద్యార్థులకు అర్హత ఉన్న స్కాలర్షిప్ల అందడం లేదని వివరించారు. కాబట్టి ప్రభుత్వం అర్హత కలిగిన విద్యార్థులందరికీ స్కాలర్షిప్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారుఅనంతరం ఫాదర్ ఆఫ్ షాద్ నగర్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జోసఫ్ అంజన్న మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ కౌన్సిలర్ ఎన్నికలలో క్రైస్తవులంతా కాంగ్రెస్ పార్టీ నాయకులకే మద్దతు తెలిపారని అన్నారు కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా క్రైస్తవులను ఆదరించాలని వివరించారు. షాద్ నగర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ కో ఆర్డినేటర్ రవితేజ,షాద్ నగర్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎన్ పీటర్, గౌరవ అధ్యక్షులు సామెల్, కార్యదర్శి వై లక్ష్మయ్య, కోశాధికారి మురళీకృష్ణ, ఫరూఖ్ నగర్ మండల అధ్యక్షులు మల్లేష్, కేశంపేట మండల అధ్యక్షులు కృష్ణయ్య, కొత్తూరు మండల అధ్యక్షులు దయనందం, నందిగామ మండల అధ్యక్షులు రఫాయెలు, చౌదరి గూడ మండల అధ్యక్షులు మాణిక్యరావు, కొందుర్గు మండల అధ్యక్షులు దేవదాసు, పి జాన్,జోసఫ్ ఫ్రాంక్లిన్,ఏడీ ఎబినేజర్ తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చెయ్యండి

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా. సమత

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఈ నెల 10న సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగే ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభను విజయవంతం చెయ్యాలని బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డా. సమత పిలుపునిచ్చారు. భారతదేశ ప్రధానమంత్రిగా మూడవసారి ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వస్తుండడంతో ప్రాధాన్యత సంతరించుకుందని ఆమె పేర్కొన్నారు. 2014వ సంవత్సరంలో కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నుండి మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం సహకరిస్తుందని ఆమె అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ఇప్పటికే నరేంద్రమోదీ ప్రభుత్వం 12 లక్షల కోట్ల రూపాయలను విడుదల చేసిందని ఆమె గుర్తు చేశారు. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు నరేంద్రమోదీ తెలంగాణకు వస్తున్నారని ఆమె తెలిపారు. రాష్ట్రంలో నరేంద్రమోదీ పర్యటన తర్వాత రాష్ట్ర రాజకీయాలలో పేను మార్పులు సంభవిస్తాయని డా. సమత పేర్కొన్నారు.

## నీటి సమస్యపై "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమం



**రాజేంద్రనగర్, మే 9 (జనంసాక్షి) :** మణికొండ, నెక్నంపూర్ మున్సిపల్ డివిజన్లలో భూగర్భ జలాలు రోజురోజుకు తగ్గిపోవడం, జలమండలి పైప్‌లైన్ తాగునీటి సరఫరాలో తీవ్ర కొరత నెలకొన్న నేపథ్యంలో బీ.ఆర్.ఎస్ పార్టీ ఆధ్వర్యంలో "వాక్ ఫర్ వాటర్" కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి ఆదేశాల తో శనివారం నాయకులు సీతారాం దూళిపాల, కుంభగళ్ళ ధన్రాజ్,అందె లక్ష్మణ్, ఉపేంద్ర నాథ్ రెడ్డి, షేక్ అరిఫ్ మహమ్మద్, గుట్టమీద నరేందర్, బొడ్డు శ్రీధర్, పట్లొళ్ళ రూపా రెడ్డి, సుమనళిని, శ్రీకాంత్ తదితరులు కలిసి కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 17 న సాయంత్రం 4:30 గంటలకు నెక్నంపూర్ చింతచెట్టు బటర్‌ఫ్లై కూడలి నుంచి మర్రిచెట్టు కూడలిలోని జలమండలి కార్యాలయం వరకు శాంతియుతంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నీరు ప్రతి మనిషి జీవితానికి అత్యవసరమని, నీటి సమస్యపై ప్రజల గొంతును ప్రభుత్వానికి వినిపించేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని బీ.ఆర్.ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ముఖ్యంగా భారీ నీటి బిల్లులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళలు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.
పోస్టర్ విడుదల కార్యక్రమంలో బీ.ఆర్.ఎస్ పార్టీ మణికొండ, నెక్నంపూర్ డివిజన్ల సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### తెలంగాణకు విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ సభను విజయవంతం చేయాలి

**రాజేంద్రనగర్,మే9(జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ గోల్కొండ గోషామహల్ ఇంచార్జ్ వై. శ్రీధర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి రూ.7828 కోట్ల భారీగా నిధులు కేటాయిస్తూ రహదారులు, రైల్వేలు, విద్యుత్ తదితర రంగాల్లో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు.

## లాలాపేటలో మెగా ఉచిత వైద్య శిబిరం

### 330 మందికి పరీక్షలు, 80 మందికి పైగా మెరుగైన చికిత్సకు ఎంపిక




**కొందుర్గు,జనంసాక్షి :** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల పరిధిలోని లాలాపేట గ్రామంలో శనివారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ శారదా నర్సింలు నేతృత్వంలో, చేవెళ్ల పట్టణానికి చెందిన పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కళాశాల వారి సౌజన్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు.గ్రామ ప్రజలకు ఎదురవుతున్న వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేయడంతో పాటు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ముఖ్యంగా మధుమేహం (షుగర్), కీళ్ల నొప్పులు మరియు కంటిచూపు సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రత్యేక పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ శారదా నర్సింలు మాట్లాడుతూ.. గ్రామంలో మొత్తం 330 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వీరిలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఉన్న 80 మందిని తదుపరి చికిత్స నిమిత్తం సోమవారం ఆసుపత్రికి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు. రోగుల సౌకర్యార్థం ఆసుపత్రి యాజమాన్యం ఉచిత బస్సు సౌకర్యాన్ని కూడా కల్పించిందని, మానవత్వంతో స్పందించిన పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కళాశాల యాజమాన్యానికి, డాక్టర్లకు మరియు సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ రవిచంద్ర రెడ్డి, వార్డు సభ్యులు మధుసూదన్ రెడ్డి, భాగ్య, బాలరాజ్, మమత, లక్ష్మారెడ్డి, శ్రీశైలం, మాజీ సర్పంచ్ రామ్ రెడ్డి మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శిబిరాన్ని విజయవంతం చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## వైభవంగా శ్రీ లక్ష్మీనరసింహ్మా స్వామి బ్రహ్మోత్సవాలు

- 4వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా భారీగా ఏర్పాట్లు
- పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు
- ఆలయ పునర్నిర్మాణ కర్త రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్,తలకొండపల్లి మాజీ జెడ్పీటిసి ఉప్పల వెంకటేష్



**తలకొండపల్లి మే09(జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం సమీపంలోని గుట్టపై స్వయంభుగా వెలసిన శ్రీ లక్ష్మి నరసింహ్మ స్వామి దేవాలయం 4,వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటిరోజు శనివారం యజ్ఞయా గాలను వేదపండితుల మంత్రోచ్ఛరణలతో ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తలకొండపల్లి జెడ్పీటిసి ఉప్పల వెంకటేష్ ఆద్వర్యంలో గణపతి పూజ, గోపూజ, స్వస్తివాచకం, రక్షాబంధనం, విశేష అభిషేకం,గణపతి నవగ్రహ, సుదర్శన హోమం, సామూహిక కుంకుమార్చన, మంగళ హారతి పూజా కార్యక్రమాలను కుటుంబ సమేతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు ప్రజలు భక్తులు వేలాది మంది పాల్గొని స్వామివారి దర్శనం చేసుకున్నారు.

**ఆదివారం నిర్వహించే కార్యక్రమాలు..**
శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవం,మాతృ దినోత్సవం సందర్భంగా సుధీర్ ఆచారి అయ్యగారు,గోవర్ధనం శ్రీ ధరాచార్యులు లచే అమ్మ పాద పూజ ఆశీర్వచనం కార్యక్రమం నిర్వహణ,అనంతరం సాయంత్రం శృతిలయ సాంస్కృతిక అకాడమీ, ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ వేసవిలో శిక్షణ పొందుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు,ప్రముఖ గాయని రేలా రేలా గంగ,ప్రముఖ నృత్యకారిణి జానులిరి,ద్వారా సాయంత్రం దేవాలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ తెలిపారు.అదేవిధంగా స్వామివారి కళ్యాణం అంగరంగ వైభవంగా పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ప్రతి ఒక్కరూ పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఆలయ పునర్ నిర్మాణకర్త ఉప్పల వెంకటేష్ తెలియజేశారు.